# 14. ఆఖరి జవాబు

శివయ్య అస్తిమితంగా బెడ్‌మీద కదిలి పక్కకి తిరిగాడు.

కళ్ళల్లో ఎక్కడో లోలోతుల్లో వున్నట్లుంది జీవకళ. భర్తని ఆ విధంగా చూస్తున్న పార్వతి కళ్ళల్లో నీరు తిరిగింది. ఆమెకు గుండెలో ఆవేదన, దుఃఖం. దిగులుతో దిక్కులు చూస్తోంది.

శివయ్య కాళ్ళ దగ్గర బెడ్‌మీదే వెంకటేశ్వర్లు మొహంలో విసుగూ, చిరాకూ.

"వయసయిపోయిన వాడివి ఇంటిపట్టున కూచోక ఈ తిరుగుళ్ళూ తాపత్రయాలూ దేనికి? ఇట్టా ప్రాణం మీదికి తెచ్చుకోవటమెందుకు?" స్నేహితుడి మీద ధర్మాగ్రహం.

"ఏంగాదులేరా. మనుషులక్కాక మానులకొస్తాయా- అనారోగ్యాలు?" శివయ్య అన్నాడు. కంఠస్వరం పీలగా ఉంది.

నర్స్ వచ్చింది. గది నిశ్శబ్దమైంది.

సెలైన్ బాటిల్ మార్చి 'జాగ్రత్త' అంటూ వెళ్ళింది.

"తనకన్నా తెలియాలి. ఎవరైనా చెప్తేనన్నా వినాలి. రోజూ సిటీలో ఆ మూలకీ ఈమూలకీ అంతంత దూరాలు బస్సుల్లో ప్రయాణాలూ, అసమయ భోజనాలూ, శరీరం భరించే వయస్సా, చిన్నాచితకా?- ఎట్టాపడితే అట్టా తిరిగేందుకు? ఇంకా ఇంత సంపాదన యావ పనికిరాదు" పెళుసుగానే వున్నై- వెంకటేశ్వర్లు మాటలు.

పార్వతి మనసు నొచ్చుకుంది. ఆమె బాధని వెంటనే అర్థం చేసుకోగలిగింది - వరలక్ష్మి. వెంకటేశ్వర్లు భార్య. గదిలో కిటికీ పక్కగా స్టూలుమీద కూచుని వుందామె.

"దూరపు కొండలు నునుపు అన్నట్టు -మనకన్నీ సవ్యంగా కనిపిస్తాయి. ఎవరి అవసరాలెలాంటివో, అనుభవించే వారికి కదా తెలిసేది?" అన్నది వరలక్ష్మి. పార్వతికి ఊరడింపుగా అనిపించాయి ఈ మాటలు.

"బాగా చెప్పావ్ వొదినా. చెప్పుకోగలిగినవా సమస్యలు. మా బాధలు మావి" అన్నది పార్వతి.

ఆమె మాటల ఆంతర్యం వెంకటేశ్వర్లుకీ తెలుసు, వరలక్ష్మికీ తెలుసు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు ఆదరణ కరువైందనే బాధ అది- ఇప్పుడు వీస్తున్న గాలి కథ. ఇప్పటి తరం నడుస్తున్న దారి గాథ! తల్లి తండ్రుల్ని పట్టించుకోని తనయుల కథే! అందరూ మౌనం వహించారు.

బయట వాతావరణంలో మార్పొచ్చింది. ఆకాశం మబ్బులు కమ్మింది. కిటికీ లోంచీ ఈదురుగాలి మొదలైంది.

పార్వతి లేచి కిటికీ రెక్కలు వేసింది.

చేతిలో ఏదో కేరీబ్యాగ్, ఫ్లాస్క్‌తో వచ్చాడు ప్రభాకరం. వెంకటేశ్వర్లు, మేనల్లుడు అతను. ఇంటర్ వరకూ చదివి, ఏదో కార్లగారేజ్‌లో పనిచేస్తున్నాడు. వెంకటేశ్వర్లు వస్తూ వస్తూ అతన్ని తీసుకువచ్చాడు. చేతికింద ఏ సహాయానికైనా ఉంటాడని. ఇప్పుడు ప్రభాకరం పార్వతికి టిఫినూ, కాఫీ తెచ్చాడు. శివయ్యకి హాస్పటల్ వాళ్ళే ఇస్తారు.

ఇంతలో వార్డ్‌బాయ్ వచ్చాడు. "ఇదిగో అడ్వాన్స్, బిల్లు. ఐదువేలు. సాయంత్రం లోగా కౌంటర్లో కట్టాలంట. కట్టండి" అని బిల్లుని పార్వతికిచ్చి వెళ్ళిపోయాడు.

శివయ్య ముఖకవళికలు మారినై. విచారం తోచింది.

వెంకటేశ్వర్లూ, వరలక్ష్మీ ఒకరి మొహం ఒకరు చూసుకుని, "సరే, మేం వస్తామింక" అంటూ సెలవు తీసుకున్నారు.

మౌనం కూడా ఒక భాషే. అసంగత సంభాషణలేమీలేకుండా వాళ్ళు నిష్క్రమించటం - చాలా అర్థాల్ని తెలిపింది శివయ్యకీ, పార్వతికీ, విచారంగా నవ్వుకుంది పార్వతి. వేదాంతిలా నవ్వుకున్నాడు శివయ్య.

* * *

శివయ్య ప్రత్యేకంగా చేసిన ఉద్యోగమేం లేదు. పోస్టాఫీస్ దగ్గర వో బల్లమీద కూర్చుని - చదువురాని వాళ్లకి ఉత్తరాలు రాసిపెట్టేవాడు. చదువు వచ్చినా కొన్ని కొన్ని పనుల్లో విధివిధానాలు తెలియని వారికి సహాయం చేసి

పెట్టేవాడు. వాళ్ళిచ్చిందేదో తీసుకునేవాడు. అదే ఆధరవు అయింది. ఆదివారం నాడు– ఆ యింటా, ఈ యింటా– ఏ సత్యనారాయణ వ్రతమో, పూజాపునస్కారమో చేయించేవాడు. వాళ్ళింటి చుట్టుపక్కల ఎవరికైనా ఏ గవర్నమెంటాఫీసులో నన్నా పనులుంటే తానుపోయి చక్కపెట్టుకొచ్చేవాడు. వారిచ్చింది తీసుకునే వాడు. అందుకనే, ఆయనకి ప్రైవేట్ శివయ్య అని పేరు బడింది.

పెళ్ళయిన చాలా కాలానికి శివయ్య –పార్వతి దంపతులకి చంద్రమౌళి పుట్టాడు. ఉన్నంతలో తృప్తిగా పెంచారు– కొడుకుని. మౌళి టెన్త్ అయింది. ఇంటర్‌ని కార్పొరేట్ కాలేజ్‌లోనే చదువుతానని భీష్మించాడు మౌళి. పంతం నెగ్గించుకున్నాడు. శివయ్యా, పార్వతీ కష్టపడ్డారు. ఇంట్లో కుట్టుమిషన్ పెట్టుకుని భర్తకి సహాయపడింది పార్వతి. అదిగాక, అనేకరకాల గృహాలంకరణ వస్తువుల్నీ చేసి అమ్మేది.

మౌళి ఇంటర్ ర్యాంక్‌తో ప్యాసయ్యాడు. ఐఐటి సీట్ వచ్చింది. ఇంజనీరింగ్‌లో చేరాడు. మద్రాస్ ఐఐటిలో చదువు కాగానే క్యాంపస్ సెలక్షన్‌లో మంచి ఉద్యోగం వచ్చింది. పూణే వెళ్ళిపోయాడు. తొలిరోజుల్లో ఉత్తరాలు సాగేవి. డబ్బూ పంపేవాడు. తర్వాత్తర్వాత, ఉత్తరాలు ఆగినై. రాజస్థాన్‌లో, గుజరాత్‌లో, ఢిల్లీలో ఎక్కడెక్కడో పనిచేస్తున్నట్లు తెలిపేవాడు. అడపా దడపా తోచినమేరకి డబ్బుని ఎంవోలు చేసేవాడు. అంతే. రాకపోకలు లేవు. ఎప్పుడూ 'బిజీ!'

సంవత్సరాలకి సంవత్సరాలు - శివపార్వతులకు - నిరుత్సాహంగా, నిర్వేదంగా, నిస్పృహలో గడిచిపోయినై.

ఉన్నట్టుండి ఓ సాయంత్రం –

మౌళి ఫోన్ చేశాడు. తానప్పుడు వెరావల్‌లో ఏదో పెద్ద కంపెనీలో ఉద్యోగం చేస్తున్నట్టు చెప్పి, ఒక గుజరాతీ అమ్మాయిని పెళ్ళి చేసుకున్నట్టు చెప్పేశాడు. క్షమాపణలూ, విచారాలూ గట్రా ఏమీ లేకుండా - సాదాసీదాగా –'అమ్మకు కూడా చెప్పు నాన్నా' అని ఫోన్ సంభాషణని ముగించాడు.

శివయ్యకీ, పార్వతికీ ఈ వార్త అశనిపాతమైంది. కొడుకు ఇంత పని చేసినందుకు దుఃఖం పొంగుకొచ్చింది ఏడ్చారు. తమలో తాము విచారించారు. కలిసి పాత జ్ఞాపకాల్ని తవ్వుకున్నారు. మౌళి భవిష్యత్తుకోసం తాముగా పడిన కష్టాల్ని పునశ్చరణ చేసుకున్నారు. అంతా అయిన తర్వాత "పోన్లే వాడేం చేసినా,

ఎట్టా ఉన్నా సుఖంగా ఉంటే అంతే చాలు" అని కళ్ళొత్తుకుంది పార్వతి. 'అంతే. అంతే...' అని కన్నీళ్ళని ఆపుకున్నాడు శివయ్య.

వెంకటేశ్వర్లు లాంటి మిత్రులకి తెలిసిందీ వార్త. నవ్వేవారికి నవ్వవేడుక, ఏడ్చేవారికి ఏడ్వవేడుక – అన్నట్లయింది.

అదిగో – అప్పట్నుంచీ శారీరకంగా, మానసికంగా జమికాడు శివయ్య. రెండు రోజులు బాగుంటే నాలుగురోజులు బాగుండని పరిస్థితి వచ్చింది. సుగరూ, బి.పీ బయట పడినై. మౌళి నుంచీ జాబులూ, జవాబులూ లేవు. అతను రాయడు, మాట్లాడడు. వీళ్లకి అభిమానం. బాధ. అశక్తత. వృద్ధాప్యంలో తమ రెక్కల కష్టం తమదిగా బతకాల్సిన స్థితి. సిటీలో ఆ మూలకీ ఈ మూలకీ బస్సుల్లో పడి వెళ్ళి పౌరోహిత్యం జరపటం – శివయ్యకి తప్పనిసరి అయింది.

వారం క్రితం –

ఈ దుర్ఘటన జరిగింది. ఆల్వాల్ నుంచీ వస్తున్నాడు శివయ్య రెతిఫైల్ దగ్గర బస్ దిగుతుంటే – వెనుకనుంచీ ఎవరో తోశారు శివయ్యని. పడ్డాడు. ఆ పడటంలో గూడు ఎముక చిట్లింది. వెంకటేశ్వర్లుకి ఫోన్ చేస్తే వచ్చి, ఓ మోస్తరు ఖర్చుండే ఈ హాస్పటల్లో చేర్చాడు. ఫ్రాక్చర్‌కి చిన్న ఆపరేషన్ జరిగింది. కానీ, టెస్టుల్లో హార్ట్‌కి ట్రుబులున్నట్లు తెలిసింది. యాంజియోగ్రామ్ తియ్యాలంటున్నారు డాక్టర్లు. వెంకటేశ్వర్లు కూడా అంతంత మాత్రం వాడే. ఆర్థికంగా స్థోమతేమీ లేదు. యాంజియోగ్రామ్‌లో రిజల్ట్‌ని బట్టి బైపాస్‌గానీ, స్టెంట్‌గానీ అవసరం వుంటుదన్నారు డాక్టర్లు.

శివయ్యకీ, పార్వతికీ ఏం చేయాలో పాలుపోవడం లేదు. చూస్తూ చూస్తూ – వైద్య పరీక్షని చేయించకుండా పోలేరు. చేయించటానికి డబ్బులేదు. మౌళిని కదుపుదామన్నా – అతనిప్పుడెక్కడున్నాడో తెలీదు.

విషయాలన్నీ పార్వతి, శివయ్య, వెంకటేశ్వర్లు వరలక్ష్మి, ప్రభాకరం మధ్య నలుగుతూ వున్నై.

❖ ❖ ❖

మధ్యాహ్నం ఒంటి గంటయింది.

అప్పుడే శివయ్య భోజనమయింది. ప్లేట్‌లో చేతులు కడిగించింది పార్వతి. ప్రభాకరం పార్వతికి భోజనం తెచ్చి చాలా సేపయింది. స్టూలుమీద కూచున్నాడు.

"మౌళి సంగతి కనుక్కోలేం గదా?" అడిగాడు శివయ్య పరధ్యానంగా. ఆయన కిటికీలోంచి బయటకి చూస్తున్నాడు. మబ్బు తునకలు తునకలుగా కనిపిస్తోంది. సన్నటి జల్లు కురుస్తోంది.

"కష్టమే. అప్పుడెప్పుడో ఫోన్‌చేసినప్పుడు విరావల్ అనో ఏదో పేరు చెప్పాడు. అక్కడి కంపెనీలో ఉద్యోగమని. ఏ కంపెనీనో, ఏం పాడో" అని బాత్‌రూమ్‌లోకి వెళ్ళింది పార్వతి. ప్లేట్ కడుక్కొచ్చి కేబినెట్‌మీద పెట్టి, "అయినా వాడి గురించి ఏ ఆశలూ పెట్టుకోలేం" అంది.

"తల్లిదండ్రులమీద ఇంత మనసూ మానవత్వం లేకుండా కూడా వుంటారు కాబోలు మనుషులు?" తనను తానే ప్రశ్నించుకుంటున్నట్టు పైకే అన్నాడు ప్రభాకరం.

శివయ్యా పార్వతీ – ఇద్దరూ విస్తుపోయి చూశారతనివైపు. "ఉదయం నుంచీ జరిగిన చర్చలూ, పరిస్థితీ ఇతనికి బాగానే అర్థమయ్యాయి." అనుకున్నారు – ఇద్దరూ.

ఇంతలో డాక్టరూ, అతని వెనుక నర్సులూ, అటెండెంట్‌లూ వచ్చారు.

'ఏమంటున్నారు పంతులుగారూ'అని నవ్వేడు డాక్టరు. శివయ్యని పరీక్ష చేశాడు. కేస్‌షీట్ తీసుకుని చూసి, "ఓ.కె.అంతా బాగానే వుంది. మరి యాంజియోగ్రామ్ సంగతి ఏం చేశారు?" అడిగాడు.

శివయ్య కళవళపడ్డాడు. 'ఇవ్వాళ రాత్రికి చెప్తాం డాక్టరుగారూ!" అన్నది పార్వతి.

అవతలికి కదులుతూనే అన్నాడు డాక్లర్, "త్వరగా తేల్చుకోవడం మంచిది. చేయించేసుకుంటే బ్లాక్స్ పొజిషన్ తెలిసిపోతుంది" అని. ఆ బృందమంతా బయటికి వెళ్ళింది.

"ఇవ్వాళ అడ్వాన్స్ కట్టేస్తే రేపు చేస్తారు. పొద్దున ఐదువేలు బిల్లూ ఇంకో పదివేలూ కావాలి" పార్వతి సన్నగా, నీరసంగా అన్నది.

"అంతటితో పోయేదేం కాదు లేవే. ఆ వెంటనే ఎటూ బైపాస్ అవసరమంటారు, ఇంకో లక్షో లక్షన్నరో తెమ్మంటారు" –నిస్పృహగా అని తలని పక్కకి తిప్పుకున్నాడు శివయ్య.

ప్రభాకరం పార్వతి వైపు చూశాడు. ఆమె చేతుల్తో గాల్లో దేవుడికి దణ్ణం పెడుతోంది. ప్రభాకరంకి నవ్వొచ్చింది. మరుక్షణంలో మొహకవళికలు మారేయి.

"తిండికి లేని వాడికే ఇలాంటి రాజరోగాలొస్తాయి. అవి తగ్గవు. వీడు తీసుకు తీసుకుపోతాడు." భౌతిక వాస్తవాన్నే వేదాంత ధోరణిలో పలికాడు శివయ్య.

ప్రభాకరం ఒక్కసారిగా చలించిపోయాడు. గుండెలో ఏ మూలనో అణచిపెట్టిన దుఃఖం పొంగుకొచ్చింది. పెదవులు వణికినై. ముక్కుపుటాలు అదిరినై. కళ్ళల్లో నీరు తిరిగింది. నిబ్బరించుకోలేకపోయాడు. "అవునుసార్. అవును. చాలామంది దుర్గతి అంతే. చాలా నిజం చెప్పారు" అని, ముక్కలు ముక్కలుగా "అవును... అదే... నిజం... అదే... నిజం ఈ లోకంలో" అంటూ భోరున ఏడ్చేశాడు.

ఈ హఠాత్పరిణామానికి పార్వతి కలత చెందింది. శివయ్య కూడా ఈ వైపుకు తిరిగి విచలితుడైనాడు. "ఛ... ఛ.. ఇదేమిటి ప్రభాకరం? ఏమైంది? ఏమైంది?" అన్నాడు ఆవేదనగా.

క్షణాలు గడిచినై. అప్పుడు చెప్పాడు ప్రభాకరం. అతని తండ్రి టీ.బీ. వ్యాధితో తీసుకుతీసుకు పోయాడు. సరైన వైద్యానికి నోచుకోలేదు. దారిద్ర్యమే కారణం. అతని చదువు ఆగిపోవటానికీ అదే కారణం.

ఆ తర్వాత చాలా సమయం బరువుగా గడిచింది. ముగ్గురూ ఆలోచనల ముంపుకు గురయినారు. మరికొంతసేపటికి ప్రభాకరం లేచి మౌనంగా బయటికి వెళ్ళిపోయాడు.

❖ ❖ ❖

ఆ పగలంతా శివయ్యా పార్వతీ రకరకాలుగా మల్లగుల్లాలు పడుతూనే ఉన్నారు. ఎన్ని ఆలోచనలు చేసినా డబ్బు పుట్టే ఇరవేమీ కనిపించలేదు. వెంకటేశ్వర్లు ఫోన్ చేశాడు-తన ప్రయత్నం తాను  చేస్తున్నానని.

ఇద్దరూ బిక్కు బిక్కుమంటూ కూచున్నారు.

ప్రభాకరం వచ్చేసరికీ ఆరుగంటలయింది. అతను పదివేలుతెచ్చి క్యాష్ కౌంటర్లో కట్టాడు! శివయ్యా, పార్వతీ ఆశ్చర్యపోయారు. మూగకళ్ళతో కృతజ్ఞతల్నీ తెలిపారు. ఆ తర్వాత ఒక గంటకి వెంకటేశ్వర్లూ వచ్చాడు. అతనూ ఐదువేలు తెచ్చి కౌంటర్లో చెల్లించాడు.

వెంకటేశ్వర్లు ఎంతగుచ్చి గుచ్చి అడిగినా – పదివేలు ఎట్టా పుట్టించుకొచ్చాడో చెప్పలేదు ప్రభాకరం. తాను మాత్రం వరలక్ష్మి గొలుసుని తాకట్టు వుంచి ఐదువేలు తీసుకు రాగలిగానని చెప్పేశాడు వెంకటేశ్వర్లు.

ఈ పరిణామాలకీ, సహాయాలకీ, వాళ్ళిద్దరి మంచితనానికీ మనస్సులోనే పదేపదే కృతజ్ఞతలు చెప్పుకున్నారు శివయ్యా, పార్వతీ. పైకి అంతకంటే ఎక్కువగా ఏమీ ప్రశంసలు నింపలేదు.

–మర్నాడు ఉదయం యాంజియోగ్రామ్ జరిగింది – శివయ్యకి. రెండు బ్లాక్స్ వున్నట్లు తేలింది. వెంటనే బైపాస్ ఆపరేషన్ చేస్తారనీ, పెద్ద కష్టం వుండదనీ, నాలుగైదు రోజుల్లోనే ఇంటికి వెళ్ళవచ్చునీ చెప్పారు. సుమారు ఒక లక్ష అవసరమవుతుందనీ అన్నారు.

మళ్ళీ డబ్బు సమస్య!

ఈసారి ఏ మార్గమూ కనిపించలేదు. అయితే, ఆపరేషన్ చేయించుకోకపోతే ప్రమాదమనే భయం మాత్రం ఎక్కువైంది. నలుగురూ పరిపరివిధాల ఆలోచనలు చేసినా –ముందడుగుకి చోటు కనిపించలేదు.

పన్నెండు గంటలు దాటుతుండగా వెళ్ళిపోయాడు ప్రభాకరం.

ఈ రోజు వర్షం తెరపిచ్చింది. ఆకాశం నిర్మలంగా వుంది. వెంకటేశ్వర్లు, వరలక్ష్మి, ఇంకా నలుగురైదుగురు పరిచయస్థులూ వుండిపోయారు. శివయ్యా, పార్వతీ వీరందరితో మాట కలుపుతున్నారే గానీ, సహజంగా పెకలిరావటల్లేదు మాట! అంతా గుండె గొంతుకలో కొట్టాడుతున్న వ్యధే! చంద్రమౌళి వీళ్ల చర్చలకి కేంద్రబిందువయ్యాడు. తల్లిదండ్రులపట్ల సంతానం నిరాదరణ గురించీ, వృద్ధాశ్రమాల ఆవశ్యకత గురించీ, వృద్ధుల అవస్థల గురించీ –చాలా అభిప్రాయాలు నడిచినై. మధ్య మధ్య మౌళి భార్య –గుజరాతీ అమ్మాయి, ప్రసక్తి వచ్చింది. "కొంతమంది గడసరి అమ్మాయిలంతే. కోడళ్ళుగావచ్చి కొడుకుని దూరం చేస్తారు" అన్నది ఎవరో ఒకామె. నవ్వి ఊరుకుంది పార్వతి. పెదవివిరిచి, శుష్కహాసం చేశాడు శివయ్య. అందరి మనస్సులూ ఉస్సురన్నాయి. మరికొంతసేపటికి వచ్చిన వారంతా వెళ్ళిపోయారు.

ఈ రోజు కూడా సాయంత్రం ఆరవుతుంటే వచ్చేడు ప్రభాకరం. "ఏంవిటి విశేషాలు?" అంటూ పరామర్శించాడు.

"మామూలు వార్తలే. ఆపరేషన్ చేయించాలి. ఎట్టా చేయించాలి? ఇదే గదా జవాబులేని ప్రశ్న" అన్నది పార్వతి.

"చూద్దాం" అని "బతుకు గీత ఎటునుంచీ ఎటు పోతుందో చెప్పలేం కదా!" అన్నాడు.

శివయ్యా, పార్వతీ ఇద్దరూ అతనికేసి సాలోచనగా, ప్రశ్నార్థకంగా చూశారు. అతనేమీ అనలేదు.

సరిగ్గా అదే సమయంలో – ఎవరో అంటెండెంట్ వచ్చి పార్వతికి ఫోన్ వచ్చిందని పిల్చాడు. వార్డు ఇన్‌ఛార్జ్ పక్కగా వుంది ఫోన్. పార్వతి లేచి వెళ్ళింది. రిసీవర్‌ని చేతిలోకి తీసుకుంది. అవతలినుంచీ మాటలు వినిపించాయి.

"నా పేరు రోహిణి అండీ. నేను మీ కోడల్ని. మౌళి నెలక్రితం యూయస్ వెళ్ళారు. ఇంకో రెండు నెలల దాకా రారు. అక్కడి విషయాలన్నీ ప్రభాకరం ద్వారా తెలిశాయి. నేనిప్పుడే హాస్పటల్ వాళ్ళకి లక్షన్నర ట్రాన్స్‌ఫర్ చేశాను. మావయ్యగారి ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండి. మళ్ళీ మాట్లాడతాను" అని ఫోన్ పెట్టేసిందామె. స్వచ్ఛమైన తెలుగులో సాగింది ఆమె మాట!

పార్వతి చేష్టలు దక్కి నిలబడింది! అటు నుంచీ ప్రభాకరం–పెదవుల మీద సన్నగా నవ్వుతో వస్తున్నాడు!

ఏనాడైనా 'మనిషి' అన్ని వ్యాఖ్యానాలకీ అతీతుడే!!

**(ఈవారం జనవార్త, జనవరి, 2014)**